సాక్షి కామారెడ్డి

శుక్రవారం : 5 : జనవరి : 2024



16 ఏళ్లుగా పోస్టు ఖాళీ

ఎల్లారెడ్డి పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో 16 ఏళ్లుగా వైద్యుడు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸



గంజాయిపై ఉక్కుపాదం

కల్తీ కల్లు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని బిచ్కుంద సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /14.9

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. రాత్రి పొగమంచు కురుస్తుంది. రాత్రిపూట చలితీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

రామమందిర ప్రారంభోత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా కేవీఆర్



కామారెడ్డి టౌన్: అయోధ్య శ్రీ రామమందిర ప్రారంభోత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి(కేవీ ఆర్) నియమితులయ్యారు. ఈ మేరకు అయోధ్య రామమందిరం పునర్నిర్మాణ కమిటీ ప్రకటించింది. ఈ నెల 22న జరగ బోయే శ్రీ రామమందిర ప్రారంభోత్సవ కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతం చేయడానికి, అయోధ్యకు పెద్ద ఎత్తున భక్తులు, సభ్యులను తరలించేందుకు ఎమ్మె ల్యే ఏర్పాట్లు చేస్తున్నారు.

అభినందించిన ప్రముఖ శాస్త్రవేత్త

కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి గురు వారం ఘనంగా సన్మానించారు. అయోధ్య నుంచి వచ్చిన ఎమ్మెల్యేకు హైదరాబాద్‌లోని విమానాశ్రయంలో స్వాగతం పలికి సత్కరించారు.

సదరం క్యాంపు తేదీల ఖరారు

కామారెడ్డి టౌన్: జిల్లాలోని దివ్యాంగుల నిర్ధారణ కోసం ఏర్పాటు చేసే సదరం క్యాంపు తేదీలను ఖరారు చేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయన్న గురు వారం తెలిపారు. జనవరిలో 10, 11, 24, 25 తేదీల్లో ఖరారు చేయగా 6వ తేదీ నుంచి స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. అలాగే ఫిబ్ర వరికి సంబంధించి 7, 8, 21, 22వ తేదీల్లో క్యాంపు జరుగుతుందని 3వ తేదీ నుంచి స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పైన తెలిపిన తేదీల్లో సదరం క్యాంపులను నిర్వహిస్తామని అర్హు లైన చెవిటి, అంధుల, మూగ, మానసిక తది తర దివ్యాంగులు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రవాణా శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



నిజాంసాగర్(జుక్కల్): రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కలి శారు. జుక్కల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు బస్సు సర్వీస్ కల్పించాలని కోరారు. కర్ణాటక, మహారాష్ట్రలకు సరి హద్దున ఉన్నందున రాష్ట్ర సరిహద్దు చెక్‌పో స్టుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాల న్నారు. అక్రమ రవాణాను అరికట్టాలని మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందించి అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తా మని.. ప్రయాణికుల ఇబ్బందులు కలగకుం డా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

7వ తేదీ నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జాతీయస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు డీఈ వో రాజు గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. అండర్–17 బాలురకు నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలకు కామారెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా చరిత్రలోనే మొదటి సారి ఈ పోటీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఓపెన్ వర్సిటీ పరీక్ష ఫీజు గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్ : బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ పీజీ ఫస్టియర్ సప్లి మెంటరీ పరీక్ష ఫీజు గడువు పెంచినట్లు వర్సిటీ కోఆ ర్డినేటర్ రంజిత గురువారం తెలిపారు. ఈనెల 10వ తేదీలోపు రూ. 500 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. అలాగే డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజు రూ. 500 అపరాధ రుసుముతో ఈనెల 23వ తేదీలోపు చెల్లించాలన్నారు. అలాగే ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఫీజు సెకం డియర్ పరీక్షలు, ఈనెల 27 నుంచి 31 తేదీ వరకు ఫీజు ఫస్ట్ ఇయర్ పరీక్షలు, ఫిబ్రవరి 16 నుంచి 22వ తేదీ వరకు యూజీ మూడో సెమిస్టర్ పరీక్షలు, ఫిబ్రవరి 26వ తేదీ నుం చి మార్చి రెండో తేదీ వరకు యూజీ ఐదో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయన్నారు.

గులాబీ రెడీ..!

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న పార్టీ

- 8న జహీరాబాద్ నియోజకవర్గ సన్నాహక సమావేశం
- అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై సమీక్ష
- హాజరుకానున్న జిల్లా ముఖ్య నేతలు



సాక్షి, కామారెడ్డి: లోక్‌సభ ఎన్నికల కోసం గులాబీ పార్టీ సన్నద్ధమవుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ముఖ్యనేతలతో బీఆర్‌ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ ఈ నెల 8న తెలంగాణ భవన్‌లో సమావేశం కానున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్ని కల్లో ఓటమి తర్వాత పార్టీ కేడర్‌లో నెలకొన్న నిరాశ నిస్పృహలను తొలగించి వారిలో ఉత్సాహాన్ని నింపేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. ఎన్నికల్లో ఓట మికి కారణాలపైనా సమావేశంలో చర్చించే అవ కాశం ఉంది. సీఎం కేసీఆర్ పోటీచేసిన కామారెడ్డి నియోజకవర్గంలో ఓటమి ఆ పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అలాగే ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజక వర్గాల్లోనూ హోరాహోరీగా జరిగిన పోరులో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఓటమి చెందారు. ఒక్క బాన్సువాడలోనే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మరోసారి విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్ని కలు జరిగి ఫలితాలు వెలువడి నెల రోజులు గడిచిం ది. ఇప్పటికే ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హన్మంత్ సింధే కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి వారికి మనోధైర్యం కల్పించారు. అధికారంలో, పద విలో లేకున్నా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్ని కల్లో మరింత పట్టుదలతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. బాన్సువాడలో మరోసారి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా పార్టీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. తన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎవరు?!

జిల్లాలో కీలకమైన కామారెడ్డి నియోజకవ ర్గంలో బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎవరన్న దానిపై స్పష్టత లేదు. మొన్నటి ఎన్నికల్లో కేటీఆర్, గంప గోవర్ధన్, శేరి సుభాష్‌రెడ్డిలు ఇన్‌చార్జీలుగా వ్యవహరించారు. అయితే కేసీఆర్ ఓటమి చెందడంతో కామారెడ్డి నియోజకవర్గాన్ని ఎవరు చూస్తా రన్న దానిపై స్పష్టత కరువైంది. స్థానికంగా పార్టీలో పట్టు ఉన్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్నా రు. అయితే ఇన్‌చార్జిగా పార్టీ ప్రకటిస్తే ఆయన గతంలో లాగే నియోజకవర్గాన్ని చూసుకునే అవకాశం ఉంది. పార్లమెంట్ ఎన్నికలు, ఆ తర్వాత పంచాయతీ, మం డల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు వరు సగా రానున్నాయి. ఎంపీ ఎన్నికల్లోపు ఇన్‌చా ర్జీని ప్రకటిస్తే గానీ పార్టీ కార్యక్రమాలు ఊపం దుకోవని నాయకులు భావిస్తున్నారు.

ఎంపీ ఎన్నికలకు సమాయత్తం

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఈ నెల 8న జరిగే సమావేశంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట మిపై చర్చించనున్నారు. ఒక్కో నియోజక వర్గా నికి సంబంధించిన ముఖ్య నేతలతో కేటీఆర్ సమావేశమై వారితో మాట్లాడతారు. తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వరుసగా రెండు సార్లు గెలుపొందిన బీబీ పాటిల్‌నే ఈ సారి బరిలో దింపుతారా ? కొత్త అభ్యర్థిని తెర పైకి తీసుకువస్తారా అన్నదానిపై ఉత్కంఠ నెల కొంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో బీఆర్‌ఎస్ నాయ కత్వం ఉంది. ఈ సారి బీజేపీ పార్లమెంట్ ఎన్ని కలపై సీరియస్‌గా ఫోకస్ చేస్తుండడంతో చీలే ఓట్లతో తమకు లాభిస్తుందన్న అభిప్రాయంలో బీఆర్‌ఎస్ శ్రేణులున్నాయి. ఈ సమావేశానికి జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్యనేతలు హాజరుకానున్నారు. సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్‌తో పాటు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్, బాన్సు వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామా రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధ న్, జాజాల సురేందర్, జెడ్పీ, డీసీసీబీ చైర్మన్లు దఫేదార్ శోభ, పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సి పల్ చైర్మన్లతో పాటు ఆయా నియోజక వర్గా లకు చెందిన పార్టీ ముఖ్య నేతలు హాజరవుతా రని సమాచారం.

సర్కారు బడులకు సౌర వెలుగులు



కోన బాన్సువాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

- జిల్లాలో 290 పాఠశాలల ఎంపిక
- తగ్గనున్న విద్యుత్ భారం
- పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించేలా ప్రభుత్వ నిర్ణయం

బాన్సువాడ: సర్కారు బడుల్లో సోలార్ సిస్టం ఏర్పా టుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం జిల్లాలో 290 పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రాథ మిక పాఠశాలల్లో రెండు కిలోవాట్ల ఎలక్ట్రికల్ ప్యాన ళ్లను ఏర్పాటు చేయనుండగా, ప్రాథమికోన్నత, ఉ న్నత పాఠశాలలకు 5 కిలోవాట్లు, కేజీబీవీలకు 10 కి లోవాట్లు గల గ్రిడ్ ప్యానళ్లను పంపిణీ చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి వ నరుల సంస్థ ద్వారా ఈ ప్రక్రియ చేపడుతున్నారు. ఐదేళ్ల పాటు ఆ సంస్థ నిర్వహణ బాధ్యతలు చేపట్ట నుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సర్కారు బడులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనుంది. కాగా గతేడాది జిల్లా వ్యాప్తంగా 20 పాఠశాలల్లో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేశారు. మిగతా 42 స్కూళ్లలో ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.

తడిసి మోపెడవుతున్న బిల్లులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు తడిసి మో పెడవుతున్నాయి. కొంత మంది ఉపాధ్యాయులు తమ జేబుల్లో నుంచి బిల్లులు చెల్లిస్తున్నారు. మరి కొన్ని చోట్ల విద్యుత్ బిల్లులు భారీగా పేరుకుపోవ డంతో కనెక్షన్లు కూడా తొలగించాల్సిన దుస్థితి నెల కొంది. పాఠశాలల్లో ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్ లైట్లతో పాటు కంప్యూటర్లు, నీటి కోసం బోర్లను వినియోగిస్తున్నారు. వీటితో పాటు బిల్లులు అధిక మొత్తంలో వస్తున్నాయి. అయితే స్కూల్ గ్రాంట్ అంతంత మాత్రంగానే విడుదలవుతోంది. అవి కూడా సకాలంలో అందకపోవడంతో అప్పటి వర కు ఈ బిల్లులు పేరుకుపోతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సోలార్ సిస్టం ఏర్పాటు చేస్తోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 290 యూనిట్లకు గాను రూ. 14.85 కోట్లు మంజూర య్యాయి. అయితే ప్రస్తుతం ప్రభుత్వం జిల్లాలో 62 పాఠశాలల్లో సోలార్ సిస్టం ఏర్పాటుకు చర్యలు చేప ట్టింది. ఇప్పటికే మన ఊరు–మన బడి ద్వారా మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఒక్కో కిలోవాట్ ప్యానల్‌కు సంబంధించి రూ. లక్ష వరకు ఖర్చవుతుండగా, ప్రాథమిక పాఠశాలలకు రూ. 2లక్షల చొప్పున, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు రూ. 5 లక్షల చొప్పున నిధులతో ఏర్పాటు చేస్తోంది.

290 పాఠశాలల్లో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్ బిల్లుల భారం తగ్గిం చడంతో పాటు పునరుత్పాదన ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జిల్లాలోని ఆయా పాఠశాలల్లో సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 290 పాఠశాలను ఎంపిక చేసింది. ఇది వరకే కొన్ని స్కూళ్లల్లో అమర్చాం. మరికొన్ని స్కూళ్లలో ఏర్పాటు చేస్తున్నాం.

–రాజు, జిల్లా విద్యాధికారి కామారెడ్డి

బాన్సువాడ	22	మండలాల వారీగా ఎంపికైన పాఠశాలలు				పెద్దకొడప్‌గల్	06
బీబీపేట్	10	గాంధారి	09	మాచారెడ్డి	17	పిట్లం	12
బిచ్కుంద	17	జుక్కల్	18	మద్నూర్	17	రాజంపేట్	12
బీర్కూర్	08	కామారెడ్డి	29	నాగిరెడ్డిపేట్	07	రామారెడ్డి	13
దోమకొండ	09	సదాశివనగర్	13	నస్రూల్లాబాద్	09	ఎల్లారెడ్డి	11
డోంగ్లీ	05	లింగంపేట్	22	నిజాంసాగర్	12	తాడ్వాయి	11

పోచారం నీటిని పొదుపుగా వాడుకోవాలి



పోచారం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): యాసంగి పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన నీటిని ఆయకట్టు రైతులు పొదుపుగా వాడుకో వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని పోచా రం ప్రాజెక్టు నుంచి గురువారం ఆయన నీటిని దిగు వకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వద్ద స్థానిక నాయకులతో కలిసి ఆయన పూజలు చేశారు. దీంతో పాటు గేట్లను ఎత్తి ప్రధాన కాలు వలోకి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నీటిని ఈ యేడు రబీ సీజన్‌లో ఆయకట్టు పరిధిలోని 'బీ'జోన్‌కు కేటాయిస్తున్నా మన్నారు. ప్రాజెక్టు నీరు 'బీ'జోన్ పరిధిలోని చివరి ఆయకట్టు చేరేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. దీంతోపాటు రైతులు సైతం ప్రాజెక్టు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని పంటల సాగు చేపట్టాలని ఆయన చెప్పా రు. కాగా పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభి వృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమం లో ఇరిగేషన్ ఎస్ఈ విద్యావతి, ఈఈ మల్లేశం, డీఈఈ వెంకటేశ్వర్లు, ఆర్డీవో ప్రభాకర్, పోచారం సర్పంచ్ విజిత, ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనో హర్‌రెడ్డి, తహసీల్దార్ మహేందర్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ బల్దియాలో నెగ్గిన అవిశ్వాసం

- సొంత పార్టీ చైర్‌పర్సన్‌నే దింపేసిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- వారితో కలిసిన బీజేపీ, ఎంఐఎం, స్వతంత్ర కౌన్సిలర్లు
- సమావేశానికి గైర్హాజరైన చైర్‌పర్సన్ వినీత వర్గం



అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలుపుతున్న కౌన్సిలర్లు

ఆర్మూర్/ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై సొంత పార్టీకే చెందిన బీఆ ర్‌ఎస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బల్దియా కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మా న సమావేశం గురువారం నిర్వహించారు. మున్సి పల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్ పాల్గొన్నారు. ఉద యం 11 గంటలకు ప్రారంభమైన సమావేశానికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు 17 మంది ప్రైవేటు బస్సులో క్యాంపు నుంచి నేరుగా వచ్చారు. వీరితో పాటు కాం గ్రెస్ నుంచి గెలుపొందిన కౌన్సిలర్ కూడా ఉన్నా రు. నలుగురు బీజేపీ కౌన్సిలర్లు హాజరు కాగా వీరి లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన కౌన్సిల ర్ కూడా ఉన్నారు. ఎంఐఎం కౌన్సిలర్ ఒకరు, ఇద్ద రు స్వతంత్ర కౌన్సిలర్లు కలిపి మొత్తం 24 మంది కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. చైర్‌ప ర్సన్ వినీత వర్గానికి చెందిన 12 మంది కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి కూడా హాజరయ్యారు. అవిశ్వాస ప్రక్రియ పూర్తవ డంతో నూతన చైర్‌పర్సన్ ఎన్నికపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు త్వరలో ఆదేశాలివ్వనున్నారు.

అవసరమైన కోరం హాజరవడంతో..

సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం 25 మంది సభ్యులు హాజరవడంతో స్పెషల్ ఆఫీసర్ బలపరీక్ష నిర్వహించగా వీరంతా అవిశ్వాస తీర్మా నానికి అనుకూలంగా ఓటేశారు. దీంతో అవి శ్వాస తీర్మానం నెగ్గినట్లు స్పెషల్ ఆఫీసర్ వినోద్ కుమార్ ప్రకటించారు. నాలుగేళ్లుగా చైర్‌పర్సన్ కుటుంబ సభ్యుల అవినీతిపై పోరాటాలు చేస్తు న్న బీజేపీ కౌన్సిలర్లు తమ పార్టీ రాష్ట్రస్థాయి నేత ల ఒత్తిడికి తలొగ్గకుండా అవిశ్వాసానికి అనుకూ లంగా ఓటు వేయడం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు కలి సివచ్చింది. దీంతో పండిత్ వినీత తన చైర్ పర్సన్ పదవిని కోల్పోయారు.

ఇది ప్రజావిజయం..

ఆర్మూర్ బల్దియాలో నాలుగేళ్లుగా జరుగుతున్న అక్రమాలకు చెక్ పడింది. ఇది ప్రజా విజయం. నేను రాజకీయాల్లోకి రాగానే ఒక వికెట్ పడింది. మున్సిపాలిటీలో అడుగుపెట్టగానే ఇక్కడ మరో వికెట్ పడింది. అవినీతిపై మరో విజయం సాధిం చాం. మున్సిపాలిటీలో కూడా బీజేపీ అధికారంలో ఉండాలని ఆర్మూర్ ప్రాంత ప్రజలు అభిప్రాయప డుతున్నారు.

– పైడి రాకేశ్ రెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే

రైల్వే ప్లాట్‌ఫాంపై రెండేళ్ల పాప

- బిడ్డను వదిలించుకున్నారు..
- ఐసీడీఎస్ అధికారులకు అప్పగించిన పోలీసులు
- కామారెడ్డి స్టేషన్‌లో ఘటన



కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో చిన్నారిని ఎత్తుకున్న స్థానికుడు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో రెండేళ్ల చిన్నారిని వదిలించుకుందో మహిళ.. ఆమె చిన్నారి కన్న తల్లేనా? లేదా మరెవరైనానా అనే వివరాలు తెలియరాలేదు. గురువారం సాయంత్రం 6.40 గం టలకు అకోలా ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ వైపు వెళ్తూ కామారెడ్డి స్టేషన్‌లో ఆగింది. ఓ ముసలావిడ రైలులో నుంచి కిందకు దిగి రెండేళ్ల చిన్నారిని ప్లాట్ ఫాంపై వదిలి రైలెక్కింది. రైలు కదలడం, పాప ప్లాట్‌ఫాంపై ఏడుస్తుండడం గమనించిన స్టేష న్‌లోని ప్రయాణికులు అలా ఎందుకు వదిలి వెళ్తు న్నావంటూ కేకలు వేశారు. రైలులోని ప్రయాణి కులు కొందరు చైన్ లాగడంతో రైలు ఆగింది. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పాపను వదిలేసి రైలు ఎక్కిన ముసలావిడను గుర్తించి విచారిం చారు. ఎవరో గుర్తు తెలియని తోటి ప్రయాణి కురాలు ఒక్క నిమిషంలో వస్తానని చెప్పి బిడ్డను నా చేతిలో పెట్టి రైలు దిగి వెళ్లిపోయిందని ఆ ముసలా విడ తెలిపింది. ఆమె తిరిగి రాకపోగా రైలు కదల డంతో ఏం చేయాలో తోచక బిడ్డను ప్లాట్ ఫాంపై వదిలానని చెప్పింది.

రైలులోని మరికొందరు కూడా ఆమె మాటలు నిజమేనని, తాము కూడా చూశామని చెప్పడంతో చిన్నారిని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకు న్నారు. తల్లి వస్తుందేమోనని చాలాసేపు వేచి చూశారు. దాదాపు రెండు గంటలు గడిచినా బిడ్డకు సంబంధించిన వారు ఎవరూ రాలేదు. దీంతో రైల్వే పోలీసులు చిన్నారిని బాలల సంరక్షణ అధికారు లకు అప్పగించారు. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతామని రైల్వే ఎస్సై తావూ నాయక్ తెలిపారు.

మహనీయుడు లూయిస్ బ్రెయిలీ

- కలెక్టర్ జితేష్ వి పాటిల్



అంధులను సన్మానిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: అంధుల కోసం ప్రత్యేక లిపిని కని పెట్టి విజ్ఞాన జ్యోతిని వెలిగించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని గురువా రం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇష్టపడి చదివి సమాజంలో మంచి గుర్తింపును పొందాలన్నారు. అంధులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణిం చాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావ య్య, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, జాతీయ అంధుల సంఘం అధ్యక్షుడు హరిసింగ్, భవిత కో–ఆర్డినేట ర్ శ్రీపతి, సుదర ఫౌండేషన్ ప్రతినిధి సుజాత రెడ్డి, దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న పథకానికే దరఖాస్తు చేయాలి

కామారెడ్డి రూరల్: ప్రజాపాలన దరఖాస్తుల్లో అర్హత ఉన్న పథకాల కాలమ్‌లలోనే వివరాలు రాయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. టేక్రియా ల్‌లో కొనసాగుతున్న కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రజలకు సక్రమంగా దరఖాస్తులు అందజే యడంతో పాటు వాటిని సరిగ్గా పూరించేలా అవ గాహన కల్పించాలన్నారు. గ్రామసభలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేసుకొని నిర్ధారిత సమయం లోగా డేటా నమోదు చేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

మంథని దేవునిపల్లిని సందర్శించిన మైనింగ్ అధికారులు



మాచారెడ్డి: పాల్వంచ మండలం మంథనిదేవునిపల్లి గ్రామాన్ని గురువారం మైనింగ్ అధికారులు సందర్శించారు. గ్రామ శివారులో అక్రమ మైనింగ్ తవ్వకాలపై మంథని దేవునిపల్లి, ఇసాయిపేట, భవానిపేట రైతుల ఫిర్యాదు మేరకు మైనింగ్ క్వారీలను జిల్లా మైనింగ్ అధికారులు పరిశీలించారు. వారితో పాటు కామారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. బ్లాస్టింగ్ వల్ల బోరు బావులు, ఇళ్లు దెబ్బతిన్నాయంటూ ఆర్డీవోకు మూడు గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నారు. బ్లాస్టింగ్ వల్ల మంథని దేవునిపల్లి గ్రామంలో దెబ్బతిన్న ఇళ్లను అధికారులు పరిశీలించారు.

షాపింగ్‌మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న కిసాన్ షాపింగ్‌మాల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ భవన యజమాని ఇంజమూరి శ్రీనివాస్ ఎస్పీ సింధూశర్మకు గురువారం ఫిర్యాదు చేశారు. గతంలో భవనంలోని నాలుగో అంతస్తు డోర్లను అధికారులు సీజ్ చేశారని దానిని తన అనుమతి లేకుండానే తెరిచి వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇదేంటని ప్రశ్నిస్తే చంపుతామంటు బెదిరింపులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బల్దియాలో 2,725 ప్రజాపాలన దరఖాస్తులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో నిర్వహిస్తున్న ప్రజాపాలనకు గురువారం 2,725 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఇప్పటి వరకు 49 వార్డుల్లో మొత్తం 26,166 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. ఈనెల 6వ తేది వరకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



బాన్సువాడ రూరల్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఆర్డీవో భుజంగ్‌రావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు ఆర్డీవోకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తపస్ అలుపెరగని పోరాటం చేస్తోందని అధ్యక్ష, కార్యదర్శులు నరసింహాచారి, శంకర్ అన్నారు. రాష్ట్ర నాయకులు రవీంద్రనాథ్ ఆర్య, భూనేకర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు దేవునిపల్లి పోలీసులు గురువారం సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ సెల్ ఇన్‌చార్జి సీఐ ప్రసాద్, పోలీసు కళాబృందం సభ్యులు ఎవరికైనా సైబర్‌నేరాలు ఎదురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. మోసపూరిత ఫోన్ కాల్స్ నమ్మవద్దని, ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు భరోసా అంతంత మాత్రమే..

- ఇప్పటి వరకు పది శాతమే అందిన యాసంగి పెట్టుబడి సాయం
- గత ప్రభుత్వంలో ఉన్నాయన్న నిధులు.. ప్రస్తుతం పక్కదారి పట్టాయా..?



మోర్తాడ్: యాసంగి పంటలు మొదలై నెల రోజులు గడుస్తోంది. కానీ రైతులకు మాత్రం పెట్టుబడి సాయం అంతంత మాత్రంగానే సాగుతోంది. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం నిధులు ఉన్నాయని రైతుబంధు నిధులను విడుదల చేయడానికి అనుమతి ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసింది. కానీ ఎన్నికల కమిషన్ అభ్యంతరం తెలుపడంతో అవి అలాగే నిలిచిపోయాయి. ఎన్నికలు ముగిసిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుతో పెట్టుబడి సాయం పథకాన్ని రైతుభరోసాగా మార్చింది. ఈ పథకం కింద రైతులకు ఎకరానికి పెట్టుబడి సాయాన్ని రూ.7,500 చొప్పున అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. రైతుభరోసా మార్గదర్శకాలను జారీ చేసే వరకు పెట్టుబడి సాయాన్ని పాత పద్ధతిలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. డిసెంబర్‌లో పెట్టుబడి సాయం నిధులను విడుదల చేయడం ఆరంభించగా ఇప్పటి వరకు ఎకరం కంటే ఎక్కువ ఉన్న భూములకు సాయం అందలేదు.

98,583 మంది రైతులకే పెట్టుబడి సాయం

జిల్లాలో ఇప్పటి వరకు 98,583 మంది రైతులకు రూ.28.29 కోట్ల పెట్టుబడి సాయం అందింది. వాస్తవానికి జిల్లాలో 2,78,351 మంది రైతులకు రూ.274 కోట్ల సాయం నిధులు విడుదల కావాల్సి ఉంది. మెజార్టీ రైతులు చిన్న సన్నకారు వారు ఉండటంతో ఎక్కువ మంది రైతులకు యాసంగి సీజను పెట్టుబడి సాయం జమ చేశారు. కానీ ఇప్పటి వరకు పది శాతం నిధులే జమ కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు పెట్టుబడి సాయం కోసం ఉన్న నిధులు ఎన్నికల తరువాత దారి మళ్లాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. లేదా గత ప్రభుత్వమే ఎన్నికల కమిషన్‌కు తప్పుడు సమాచారం అందించిందా అనే వాదనలు వినిపిస్తున్నాయి. పెట్టుబడి సాయం నిధులను దారి మళ్లించకుండా చూడాలని అప్పట్లో కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌ను మొరపెట్టుకున్నారు. అయినా సాయం నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయాన్ని త్వరగా అందించాలని రైతులు కోరుతున్నారు.

అందరికీ అందుతుంది

పెట్టుబడి సాయం అందరి రైతులకు జమ అవుతుంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ ఆదేశానుసారం నిధులు మంజూరు కాగానే పెట్టుబడి సాయం అందిస్తాం. త్వరలోనే అందరి రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది.

– వాజీద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి

తప్పిపోయిన బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పిపోయిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాడ్వాయి మండలం కృష్ణాజివాడి గ్రామానికి చెందిన మరుపల్లి సౌందర్య తన రెండేళ్ల కుమారుడితో కలిసి జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించేందుకు గురువారం మధ్యాహ్నం వచ్చింది. ఈ క్రమంలో బాబును తన మరిదికి ఇచ్చి స్వగ్రామానికి వెళ్లాలని తెలిపినా అతను ఒంటరిగానే వెళ్లిపోయాడు. బాబును తన మరిది తీసుకెళ్లాడని భావించిన తల్లి గ్రామానికి వెళ్లింది. ఆస్పత్రిలోని వార్డుల్లో తిరుగుతూ ఒంటరిగా ఏడుస్తున్న బాబును గమనించిన సిబ్బంది ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మణ్‌కు అప్పగించారు. దీంతో అతను ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించారు. తల్లి సౌందర్య బాబు తప్పిపోయాడని తెలిసి హుటాహుటిన సాయంత్రం ఆస్పత్రికి రాగా పోలీసులు బాబును తల్లితండ్రులకు అప్పగించారు.

ఆర్టీసీ అద్దె బస్సుల చర్చలు సఫలం



ఖలీల్‌వాడీ: ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘంతో జరిపిన చర్చలు సఫలమైనట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ముందుగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సమస్యలు విన్నవించిన అనంతరం బస్సు భవన్‌లో సజ్జనార్‌తో కలిసి జరిపిన చర్చలు సఫలమైనట్లు పేర్కొన్నారు. అద్దె బస్సు యజమానుల ప్రధాన నాలుగు డిమాండ్లను సానుకూలంగా స్పందించారని తెలిపారు. వారం రోజుల్లో సమస్యల పరిష్కారానికి ఓ కమిటీని వేసినట్లు చెప్పారు. ప్రయాణికులకు సంక్రాంతి పండుగకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అద్దె బస్సులు యధావిధిగా నడుస్తాయని ఆర్టీసీ ఎండీకి యజమానులు స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర కమిటీతో పాటు జిల్లా సభ్యులు మధుకర్, గణేశ్ కుమార్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పురస్కరించుకుని క్యాంపస్‌లో యువజన క్రీడోత్సవాలను గురువారం నిర్వహించారు. రిజిస్ట్రార్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. స్వామి వివేకానంద చెప్పినట్లు ఉక్కు నరాలు, ఇనుప కండరాలు కలిగిన యువత దేశానికి అవసరమన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజ్, నాయకులు సాయి కుమార్, అమృత్ చారి, ప్రమోద్, సింహాద్రి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎంవో కార్యదర్శిని కలిసిన ట్రెసా నాయకులు



సుభాష్‌నగర్: సీఎం కార్యాలయ కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ట్రెసా) నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి గౌతంకుమార్, నిజామాబాద్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పీజీ కోర్సులకు అటానమస్ హోదా..



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ కళాశాలలోని పీజీ కోర్సులకు అటానమస్ హోదా లభించిందని, సిలబస్‌లో మార్పులు, పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కళాశాలకే ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో పీజీ కోర్సు మొదటి సంవత్సర విద్యార్థులకు ఒకరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యాన్ని పెంచుకొని పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచేందుకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫీక్, కో–ఆర్డినేటర్ సత్యవరప్రసాద్, భరత్ రాజ్, జాన్, సుకుమార్, ముత్యంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ, రవిరాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

అంకాపూర్‌లో హన్మకొండ రైతులు

పెర్కిట్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని హన్మకొండ జిల్లా ఐనవోలు మండలానికి చెందిన రైతులు సహాయ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అంకాపూర్‌లో సాగవుతున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అంకాపూర్ రైతులు సాగులో అవలంభిస్తున్న విధానాలు, నీటి యాజమాన్య పద్ధతులను గ్రామ గురడి రెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు పీసీ గంగారెడ్డి, సభ్యుడు కేకే భాజన్నను అడిగి తెలుసుకున్నారు. అలాగే యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని నీటి నిలువు తొట్టెలు, విత్తన శుద్ధి కర్మాగారాలను పరిశీలించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి విజయ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

నాయకులం కాదు ప్రజా సేవకులం

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాము ప్రజా నాయకులం కాదని ప్రజా సేవకులుగా ఉండేందుకే రాజకీయాలలోకి వచ్చామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట, బెజుగంచెరువు తండా గ్రామాలలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులెవరైనా ప్రజలకు సేవ చేసేవారు కావాలి తప్ప ప్రజలను దబాయించేవారు కాకూడదన్నారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసమే ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తాను గట్టిగా మాట్లాడాల్సి వచ్చిందని చెప్పారు. ప్రజాపాలన దరఖాస్తు గరీబోళ్ల దరఖాస్తు అని, ఈ దరఖాస్తు ద్వారా ప్రతి పేదోడికి రేషన్‌కార్డు, ఇల్లు, పింఛన్ తప్పకుండా వస్తాయని చెప్పారు. పేదోడికి న్యాయం జరగని చోటుకి తాను తప్పకుండా వస్తానని, వారికి న్యాయం జరిగేక్రమంలో తాను చావుకైనా సిద్ధపడతానన్నారు. ప్రజాపాలనలో వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయని, కాని వచ్చిన దరఖాస్తులలో అర్హులకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనప్పుడే తనకు నిజమైన సంతోషం కలుగుతుందని, అది కూడా త్వరలోనే సాధ్యం కాబోతుందని చెప్పారు. ఆర్డీవో ప్రభాకర్, మండల ప్రత్యేకాధికారి రఘునాథ్, సర్పంచ్‌లు సునీతరెడ్డి, మంగ్లీ, ఎంపీటీసీ మాధవి, ఎంపీపీ రాజ్‌దాస్, జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీడీవో రఘు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను అప్పుల కుప్పగా మార్చారు

గత ప్రభుత్వంలో పాలకులు తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు విమర్శించారు. నాగిరెడ్డిపేటలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాల నాయకులు తమ ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తులలో బ్యాంకు అకౌంట్ నంబర్ లేదని కొందరు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని, కాని దరఖాస్తులో ఆధార్‌కార్డు నంబర్ ఉంటుందని, ఆధార్ నంబర్‌కు బ్యాంకు అకౌంట్ నంబర్ లింకై ఉంటుందని తెలియనివారు పిచ్చిమాటలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. ప్రతిపక్ష నాయకులు సృష్టించే అపోహలను ప్రజలు నమ్మవద్దన్నారు. నాయకులు రాంచందర్ రెడ్డి, విఠల్‌రెడ్డి, బోయిన విఠల్ పాల్గొన్నారు.



బోర్గాం మీ-సేవ సెంటర్ వద్ద చంటిపిల్లలతో..

అక్కడ ఫుల్.. ఇక్కడ నిల్



పెద్దబజార్‌లోని మీ సేవ సెంటర్‌లో..

ప్రజాపాలన దరఖాస్తుల పుణ్యమా అని జిల్లాలోని మీ సేవ, ఆధార్ సెంటర్ల వద్ద ఉదయం నుంచే ప్రజలు బారులుతీరుతున్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పొప్పులను సవరించుకునేందుకు ఆధార్ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. పెద్ద సంఖ్యలో ఆధార్ కేంద్రాలకు చంటిపిల్లలతో ఉదయాన్నే చేరుకొని ఎదురుచూస్తున్నారు. ఇదే క్రమంలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలు ప్రజలు లేక బోసిపోతున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్



పాత మున్సిపల్ కార్యాలయంలో..



గాజులపేటలోని ప్రజాపాలనలో ప్రజలు లేని దృశ్యం

మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తాం

- రాష్ట్ర వైద్య శాఖ మంత్రి రాజనర్సింహా



మాట్లాడుతున్న మంత్రి రాజనర్సింహా

పెర్కిట్: గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన విద్య, వైద్య ఆరోగ్య శాఖలను అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జక్రాన్‌పల్లి మండలంలో పలు కార్యక్రమాలకు హాజరైన మంత్రి ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమంలో కాసేపు సేదా తీరారు. ముఖ్యంగా సామాన్యునికి అత్యవసరమైన విద్య, వైద్య రంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రధానమైన విద్య, వైద్య శాఖల్లో మౌలిక వసతులను పూర్తి చేసి నోటిఫికేషన్ ద్వారా సిబ్బందిని భర్తీ చేస్తామన్నారు. జిల్లాను సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా అభివృద్ధి చేస్తామన్నారు.ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, ఆర్మూర్, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు వినయ్ రెడ్డి, సునీల్‌రెడ్డి, నాయకుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం



బస్సులో తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సై

మద్నూర్: కల్తీ కల్లు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెద్దశక్కర్గా, మద్నూర్, మేనూర్ గ్రామాల్లో కల్లు దుకాణాలు, తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో గురువారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని, దీని కోసం అందరూ సహకరించాలని కోరారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు వెంట వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. పలు కల్లు దుకాణాల్లో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎవరైన అక్రమంగా మత్తు పదార్థాలు వాడినా, రవాణా చేసినా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, సిబ్బంది ఎల్లయ్య, పెంటయ్య, నవీన్‌రెడ్డి, శ్రీధర్, పరశురాం, అనిత, ప్రేమలత, వనిత, స్వరూప ఉన్నారు.

ఉప్పర్‌పల్లిలో పశువులకు చికిత్స



బీబీపేట: జిల్లాలోని పాడి రైతులు ఉచిత కృత్రిమ గర్భధారణ చికిత్స కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు అన్నారు. మండలంలోని ఉప్పర్‌పల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించినట్లు మండల పశువైద్యాధికారిణి హేమశ్రీ తెలిపారు. గ్రామంలోని పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధులను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీలు సంజయ్, శ్రీనివాస్, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ రాంచందర్, గోపాలమిత్రలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బాన్సువాడ రూరల్: వర్ని మండలం చింతల్‌పేట్ తండాకు చెందిన కాట్రోత్ పీర్యా(47) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. తండాకు చెందిన పీర్యా అదే తండాకు చెందిన రాందాస్‌తో కలిసి మార్గమధ్యలో ఉన్న శంకర్ పంట పొలానికి ఉన్న జీఏ వైరును తాకారు. దీంతో వారికి విద్యుదాఘాతం సంభవించి కిందపడిపోయారు. గమనించిన స్థానికులు రాందాస్‌కు గాయాలు కాగా, పీర్యాను ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదు మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని బోర్గాంకు చెందిన నరేశ్(30) అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. గత నెల డిసెంబర్ 20న ఇంటి నుంచి పని కోసం వెళ్లిన అతను తిరిగి రాలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



కాట్రోత్ శ్రీకాంత్(ఫైల్)

నాగిరెడ్డిపేట: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. మండలంలోని ధర్మారెడ్డి తండాకు చెందిన కాట్రోత్ శ్రీకాంత్ (31) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల మెదక్ జిల్లాకు చెందిన ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారి మధ్య గొడవలు చోటు చేసుకోవడంతో మద్యానికి అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 1న గడ్డిమందు తాగి కుటుంబీకులకు తెలిపాడు. గతంలో శ్రీకాంత్ ఇలాగే గడ్డిమందు తాగినట్లు బెదిరించేవాడనే కారణంతో కుటుంబీకులు నమ్మలేదు. బుధవారం శ్రీకాంత్‌ను ఎల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని సూచించారు. దీంతో వారు ఇంటికి రాగా బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు కాట్రోత్ సర్వన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దర్శన్ థియేటర్ ప్రాంతంలో రైలు కింద పడి ఓ యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావ్యూనాయక్ గురువారం తెలిపారు. దోమకొండకు చెందిన కామిండ్ల నరేందర్(26) కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల ఆయన మానసిక పరిస్థితి దెబ్బతిన్నది. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన అతను రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యాపారి ఇంటిపై అధికారుల దాడి

- 89 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: మాచారెడ్డి చౌరస్తాలో ఓ వ్యాపారి ఇంటిపై టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం దాడి చేశారు. దాడిలో అక్రమంగా నిల్వ చేసిన 89 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మ్యాడమ్ వెంకట్ రాములు అనే వ్యాపారి కొన్ని రోజులుగా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడి చేసినట్లు చెప్పారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో అధికారులు సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రావు, లక్ష్మయ్య, కిష్టయ్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



వర్ని: ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై కృష్ణకుమార్ గురువారం తెలిపారు. వర్ని పీఎస్ పరిధిలోని లక్ష్మాపూర్ అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.